క్లుప్తంగా

కె.కొత్తపల్లి సర్పంచ్ రాజీనామా



రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందిస్తున్న సర్పంచ్ శ్రీరాములు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం కె.కొత్తపల్లి వైఎస్సార్ సీపీ గ్రామ సర్పంచ్ ఇమ్మడి శ్రీరాములు రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం మార్కాపురం ఎంపీడీఓ తోట చందనకు లేఖ అందజేశారు.

గడ్డి జొన్న విత్తనాలు పంపిణీ



గడ్డి జొన్నలు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

కొనకనమిట్ల: పశు పోషకులకు అవసరమైన గడ్డి జొన్నలను సంఘం డెయిరీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గొట్లగట్టు పశువైద్యశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. పశుగ్రాసం కొత తీర్చేందుకు రైతులకు 150 కేజీల జొన్నలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ పెరికె సుభ్‌దేవ్, రైతులు పరిటాల సుబ్బయ్య, పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కూలింగ్ ఫ్రీజర్ బహూకరణ



కూలింగ్ ఫ్రీజర్ బహూకరిస్తున్న ఎంపీపీ

కంభం: స్థానిక ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలకు ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ గురువారం మినరల్ వాటర్ కూలింగ్ ఫ్రీజర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే వారికి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ సావిత్రి, పక్కన వైద్యాధికారులు

మార్కాపురం: తల్లిపాలు బిడ్డకు ఇస్తే వారు ఆరోగ్యకరంగా, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని మార్కాపురం జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో ఆర్‌బీఎస్‌కె కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బా పాల కంటే తల్లిపాలలో అధిక పోషకవిలువలు ఉంటాయని, తల్లిపాలు తాగడం వల్ల వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండి సీజనల్ వ్యాధులను తట్టుకునే శక్తి ఉంటుందని తెలిపారు. డబ్బా పాలు తాగడం వల్ల పలురకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. నవజాత శిశువులకు ప్రతి రెండు గంటలకొకసారి తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ప్రయాణ సమయాల్లో లేదా బయటకు వెళ్లినప్పుడు బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ వైద్యశాలలు తదితర కార్యాలయాల్లో ప్రభుత్వం మదర్‌ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని, పాలిచ్చే తల్లులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్, ఆర్ఎంఓ డాక్టర్ రామచంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ కేశవ చంద్ర, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తూర్పు వీధిలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

పెద్దారవీడు: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు భవిత కేంద్రంలో 9 మందికి ఫిజియోథెరపీ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించుకుంటే వైకల్యం దూరమై సాధారణ స్థితికి చేరుకుంటారని తెలిపారు. ప్రతి గురువారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తారని, మిగిలిన రోజుల్లో ఇంటి వద్ద పిల్లలకు వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్టీలు బాలవర్ధిరాజు, బీబీ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.



కంభం కూరగాయల మార్కెట్



కూరగాయలు కొంటున్న ప్రజలు

ఆదాయం మిన్న..అభివృద్ధి సున్నా!



దుకాణాల ఎదుట నిలిచిన వాహనాలు



మార్కెట్ వెనుక ఉన్న మాంసం దుకాణాల గదులు

- అభివృద్ధికి నోచుకోని కంభం కూరగాయల మార్కెట్
- 60 ఏళ్ల చరిత్ర ఉన్న మార్కెట్‌లో కనీస వసతులు కరువు
- మార్కెట్ ద్వారా పంచాయతీకి ఏటా రూ.20 లక్షల ఆదాయం
- అయినా అభివృద్ధిపై దృష్టి సారించని అధికారులు, పాలకులు

కంభం: కంభం పంచాయతీకి ఏటా రూ.20 లక్షలకుపైగా ఆదాయం అందిస్తున్న కూరగాయల మార్కెట్‌లో కనీస వసతులు కల్పించకపోవడంపై దుకాణదారులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. గతంలో పార్కువీధిలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను 1970వ సంవత్సరంలో ప్రస్తుత సర్కిల్ కార్యాలయం వెనుక అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో దుకాణదారులు రోజువారీ రుసుం చెల్లిస్తూ ఉచితంగా కూరగాయలు పెట్టుకుని అమ్ముకునేవారు. కాలక్రమేనా వ్యాపారాలు పెరగడం, జనసంచారం పెరుగుతుండటంతో ముందు రేకుల షెడ్లు, ఆ తర్వాత కొన్ని శ్లాబు రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఏటా పాట నిర్వహించి వ్యాపారులు రూమ్‌లు సొంతం చేసుకొని తమ వ్యాపారాలు కొనసాగించుకుంటున్నారు.

మొత్తం 30 గదులు

కూరగాయల మార్కెట్‌లో 8 ఆర్‌సీసీ గదులు, 18 రేకుల షెడ్లు, మాంసం దుకాణాలతో కలిపి సుమారు 30 గదుల వరకు ఉన్నాయి. గతంలో ఓ మోస్తరుగా ఉన్న అద్దెలు ఏటా పెరిగిపోతున్నాయి. దుకాణదారులు ఒకరిమీద ఒకరు పోటీలు పడి దుకాణాల వేలంపాట పాడుకుంటుండంతో గది ఆధారంగా ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. అదనంగా రుసుముల పాట రూపంలో పంచాయతీకి అదనపు ఆదాయం అందిస్తూ కంభం పంచాయతీకి మార్కెట్ మంచి ఆదాయ వనరుగా మారింది.

ఇవీ.. సమస్యలు

మార్కెట్‌లో ప్రధాన ముఖద్వారం ఉన్న గేటు విరిగిపోయినా అధికారులు పట్టించుకోలేదు. మార్కెట్‌లో నిత్యం ఆవులు సంచరిస్తుడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు మార్కెట్‌లోని దుకాణాల ముందు తెచ్చి పెడుతుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మార్కెట్‌లోని వ్యర్థాలను మొత్తం వెనుకనే పడేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది పరిసరాలను నామమాత్రంగా శుభ్రం చేసి వదిలేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మార్కెట్ ఆవిర్భవించినప్పటికీ ఎంతో మంది సర్పంచ్‌లు మారారు, అధికారులు మారుతూ వచ్చారు కానీ ఏ ఒక్కరూ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు పూనుకోలేదు. మార్కెట్‌లో కాకుండా ప్రధాన కూడలిల్లో కూరగాయల దుకాణాలు ఏర్పడుతుండటంతో వేలకు వేలు అద్దెలు చెల్లించే తమకు నష్టం వాటిల్లుతోందని పలువురు వాపోతున్నారు.

కనీస వసతుల కరువు

కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నుంచి రైతులు వారు పండించిన పంటను కంభం మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తుంటారు. సుమారు 200 మందికి పైగా చిరువ్యాపారులు మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి పల్లెల్లో విక్రయించుకునేందుకు తీసుకెళ్తారు. బెంగళూరు, మదనపల్లి, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి మినీ లారీలు, బులెరో ట్రక్కుల్లో కూరగాయలు తీసుకొని కంభం మార్కెట్‌కు రాత్రి పది గంటల నుంచి వస్తుంటారు. వారు మార్కెట్ వద్ద వాహనాలు పెట్టుకొని నిద్రపోవాలన్నా, ఇతర కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉండే ప్రజలు, హోటల్స్, హాస్టల్స్ ఇతర ప్రజలు మొత్తంగా రోజుకు వెయ్యి మందికి పైగా ప్రజలు మార్కెట్‌కు వచ్చి వెళ్తుంటారు. మార్కెట్‌లో 30 గదులు ఉండటంతో దుకాణాల యజమానులు, అక్కడ పనిచేసే సిబ్బంది సుమారు 100 మంది వరకు మార్కెట్‌లో తెల్లవారు జామున 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటారు. నిత్యం ఇంత రద్దీగా ఉండే ఈ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కనబడటం లేదు. మార్కెట్‌లో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.



మార్కెట్‌లో సంచరిస్తున్న ఆవు



దుకాణాల మధ్య నిలిచిన మురుగు

దుకాణదారుల డిమాండ్స్

- మరుగు దొడ్లు నిర్మించాలి
- మంచినీటి కుళాయి వేసి ట్యాంక్ ఏర్పాటు చేయాలి
- నూతన గేటు ఏర్పాటు చేయాలి
- మార్కెట్‌లోకి ఆవులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకుండా చర్యలు తీసుకోవాలి
- రాత్రి పూట కూరగాయల లోడుతో వచ్చే డ్రైవర్లు నిద్రపోయేందుకు గది ఏర్పాటు చేయాలి

మరుగుదొడ్లు నిర్మించాలి:



మార్కెట్‌కు 32 సంవత్సరాలుగా వస్తున్నాం. ఉదయం 4 గంటలకు మార్కెట్‌కు వచ్చి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటాం. మరుగుదొడ్లు లేకపోవడంతో అసౌకర్యంగా ఉంది. కనీస సౌకర్యాలు లేక పోవడంతో వ్యాపారులతో పాటు ఇక్కడికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

బి.గీత, వ్యాపారి

మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి:



కూరగాయల కోసం తరుచూ మార్కెట్‌కు వస్తుంటా. ఎంతో చరిత్ర కలిగిన కంభం కూరగాయల మార్కెట్‌ను అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు మెరుగు పరిచి మార్కెట్‌ను అభివృద్ధి చెయ్యాలి.

వీవీ రాము

35 ఏళ్లుగా మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్నా:



35 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఆకుకూరలు అమ్ముతున్నా. సంవత్సరానికి రూ.40 వేలు అద్దె చెల్లిస్తున్నా. గేటు ఏర్పాటు చేసి వాహనాలు, పశువులు లోపలికి రాకుండా చెయ్యాలి.

పాండురంగారెడ్డి

మంచినీరు కూడా లేవు:



మార్కెట్‌కు రోజూ ఉదయం పూట వచ్చి హోల్‌సేల్ షాపుల్లో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటి వద్ద అమ్ముకుంటా. మార్కెట్ వచ్చినప్పుడు మంచినీరు తాగాలంటే లేవు షాపుల వారి దగ్గర అడిగి తాగుతుంటాం. ఇంత పెద్ద మార్కెట్‌లో కనీసం నీటి సౌకర్యం కూడా లేక పోవడం బాధాకరం. వెంటనే మార్కెట్‌లో మంచినీటి సౌకర్యం ,ఇతర వసతులు కల్పించాలి.

ఖతీజాబీ, చిరువ్యాపారి

ప్రమాదకరంగా విద్యార్థుల ప్రయాణం

కొమరోలు: విద్యార్థులు ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వివరాలు.. కొమరోలు నుంచి పదుల సంఖ్యలో ఆటోల్లో విద్యార్థులు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రయాణం చేస్తున్నారు. మండల కేంద్రం కొమరోలులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉండగా నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు గమ్యస్థానాల నుంచి విద్యాలయాలకు, విద్యాలయాల నుంచి గమ్యస్థానాలకు ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను ఆటోడ్రైవర్లు ఎక్కించుకుంటూ ఆటోలను వేగంగా నడుపుతుండటంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్లె వెలుగు బస్సులు లేకపోవడంతోనే..

గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు లేకపోవడంతో ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు తెలుపుతున్నారు. మండలంలోని తాటిచెర్లమోటు నుండి తిమ్మారెడ్డి పల్లె గ్రామం వరకు గతంలో పల్లెవెలుగు బస్సులు నిత్యం తిరుగుతూ ఉండేవి. అల్లినగరం, తిమ్మారెడ్డిపల్లె, పోసుపల్లె గ్రామాలకు విద్యార్థుల కొరకే పల్లెవెలుగు బస్సులను నడిపిన రోజులు ఉన్నాయి. కానీ విద్యార్థులకు ఉచిత పాస్‌లు ఉండటంతో ఆర్టీసీకి ఆదాయం లేకపోవడంతో పల్లెవెలుగు బస్సులను సంబంధిత ఆర్టీసీ అధికారులు నిలుపుదల చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో ప్రమాదకర ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు ఆపాలి

మార్కాపురం: మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై వేధింపులు ఆపాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు స్కీమ్ వర్కర్లను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 94 ప్రకారం, స్టాండింగ్ కౌన్సిల్ ఉత్తర్వుల ప్రకారం ఎవరినీ విధుల నుంచి తొలగించవద్దని డీఈఓ ఆదేశాలు జారీచేశారన్నారు. అయినా ఆ జీవోలను పక్కనపెట్టి స్కీమ్ వర్కర్లపై రాజీనామాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 24 ఏళ్లుగా ప్రభుత్వం బిల్లులు ఇచ్చినా, ఇవ్వకున్నా అప్పు చేసి మధ్యాహ్న భోజన కార్మికులుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించామన్నారు. ప్రభుత్వం స్పందించి స్కీమ్ వర్కర్ల తొలగింపును ఆపాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన

నర్సరీల యజమానులు నిబంధనలు పాటించాలి

గిద్దలూరు రూరల్: నర్సరీల యజమానులు నిబంధనలు పాటిస్తూ రైతులకు ప్రోత్సాహకరంగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారి విష్ణుప్రియ అన్నారు. మండలంలోని బురుజుపల్లెలో ఆమె గురువారం నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీడపురుగులు, తెగుళ్ల యాజమాన్యం చేసి మొక్కలను రైతులకు విక్రయించాలన్నారు. నర్సరీలను నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మొక్కల ఎదుగుదలను బట్టి ఎరువుల వాడకం ఉండాలని సూచించారు. రైతుల పట్ల అంకిత భావంతో పనిచేస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఉద్యాన శాఖ సిబ్బంది ఉన్నారు.



నర్సరీలను తనిఖీ చేస్తున్న విష్ణుప్రియ

వైభవంగా పూర్ణాహుతి



లలిత సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు



పూర్ణాహుతి కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హోమ పూజలు, పూర్ణాహుతి వైభవంగా సాగాయి. గత 40 రోజులుగా నిర్వహిస్తున్న సామూహిక కోటి కుంకుమార్చన పూజలు బుధవారంతో ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని లలిత సహస్ర నామాలు, గోవింద నామాలు పారాయణం చేశారు. ఉభయదాతలు, పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలకు వితరణ ఇచ్చిన వరికుంట్ల అనిల్‌కుమార్ దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి శ్రావణి వెంకటేశ్వర్లు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, పెరుమాళ్ల భాస్కర్, ఎస్.నాగేశ్వరరావు, పొనుగుపాటి కోటేశ్వరరావు, మేడా నరసింహారావు దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

కొనకనమిట్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. గురువారం చినారికట్లలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను కాదని టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది.



చినారికట్లలో పింఛను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

ఉపాధ్యాయులకు ఆదర్శం సుబ్బారావు

మార్కాపురం టౌన్: గత 30 యేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో వేలాది మంది విద్యార్థులకు చదువు నేర్పి అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు గోసు వెంకట సుబ్బారావు ఆదర్శంగా నిలిచారని ఏఎంసీ మాజీ డైరెక్టర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాదయాదవ్ పేర్కొన్నారు. గొబ్బూరు పాఠశాల హెచ్ఎం వెంకటసుబ్బారావు యాదవ్ పదవీ విరమణ సందర్భంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో సుబ్బారావు తనవంతు సామాజిక సేవ నిర్వహించి పేదలకు నిత్యావసర వస్తువులు అందించారని కొనియాడారు. ఆయన పనిచేసిన వివిధ పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంచారన్నారు. ఆయన చదువు నేర్పిన వారిలో 9 మంది విద్యార్థులు డాక్టర్లుగా స్థిరపడ్డారని, బీసీ సంఘ నిర్మాణంలో కీలకపాత్ర సుబ్బారావు పోషించారని పేర్కొన్నారు.



సుబ్బారావును సన్మానిస్తున్న పీఎల్‌పీ యాదవ్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

మార్కాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవరత్నం పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని 7 మంది సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించడం శుభపరిణామమన్నారు. న్యాయవ్యవస్థతోపాటు అలుపెరగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గడియార స్తంభం వద్ద మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పందీటి కాశీరావు, ఎంఈఎఫ్ నాయకులు సంజీవయ్య, ఆదాం, కిశోర్, అబ్రహాం, జాకబ్, పాపయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

బిడ్డకు తల్లిపాలే దివ్య ఔషధం

పొదిలి: బిడ్డకు తల్లిపాలే దివ్య ఔషధమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సీడీపీఓ సుధామారుతి చెప్పారు. గురువారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్ ముత్తరాసు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు ఇచ్చే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాలలో అందించే పోషకాహార వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను లబ్ధిదారులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభాషిణి, సావిత్రి, ఝాన్సీరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



శిశువును లాలిస్తున్న సీడీపీఓ సుధామారుతి

వేలం ప్రకటన

మహా రాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP 113/2015 In OS 41/2002

Mogili subrahmanyam ... DHR

V/s

Chirlamcherla mallikarjuna rao ...JDR

పై నెంబరు EP లోని DHR డిక్రీ బాకీని రాబట్టుకొను నిమిత్తము. JDR తాలుకు EP లోని ఈ క్రింది షెడ్యూలు స్థిరాస్తిని పై కోర్టులో 17-8-2024వ తేది ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5.00గంటలలోపు బహిరంగముగా వేలం వేయబడును. కావలసినవారు వేలం పాటలో పాల్గొని, పాట పాడు కొనవచ్చును.వరతులు వర్తిసాయి.

షెడ్యూలు :

EP Schedule Property Situated in markapur town and in Markapur Dist Regn and in Markapur Sub - Registration Prakasam Dt. belonging to the JDR with in the following boundaries. House D. No. 7/192

East : Javvaji Mahalakshmamma House

West : Sadu chenchu Subbamma House

South : Nehru Bazar. **North :** Canal.

Unspecified and undevided 1/24th share of the JDR.

DHR Value Rs. 5,00,000/-
Ameen Value Rs. 50,00,000/-
Market Value Rs. 38,80,000/-
వేలం తేది : 17-08-2024
Further Hearing Date : 23-8-2024

D. Ch. Hanuma Nayak, Advocate, Markapur, Advocate for DHR.